నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 6 మే 2025 | NAGARKURNOOL

కర్షకుల కన్నీరు

సింగాయపల్లిలో వంటావార్పు

- కొనుగోలు కేంద్రం ఆలస్యంపై ఆగ్రహం
- మిల్లర్లు ధాన్యం దించుకోవాలని డిమాండ్

సింగాయపల్లిలో రోడ్డుపై వంటావార్పు నిర్వహిస్తున్న రైతులు

గోపాలపేట, మే 5: ఆంక్షలు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనాలని ఏదుల మండలం లోని సింగాయపల్లి రైతులు సోమవారం వంటా.. వార్పు చేపట్టి నిరసన తెలుపుతూ రోడ్డుపై ధర్నా చేశారు. గ్రామంలో వరి కోతలు ప్రారంభమై నెల కావస్తున్నా.. ఆలస్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం రెండు లారీల వడ్లు మాత్రమే పంపించారని, ఆ లారీల వడ్లను దింపకుండా తాలు ఉందని రైస్‌మిల్లర్ మొండికేయడం సబబుకాదని వాపోయారు. వడ్లు తూర్పార పట్టాలని అధికారులు మిషన్ పంపించారని, అది ఎంతమాత్రం సాధ్యం కాదని రైతులు భీష్మించుకున్నారు. పదేండ్లుగా ధాన్యం అమ్మకాలు చేపడుతున్నా కొత్తగా ప్రభుత్వం తూర్పార పట్టాలంటూ.. మిషన్లను పంపడం సరైంద కాదని రైతులు రోడ్డుపైన బైఠాయించారు. ఎలాంటి షరతులు లేకుండా వడ్లు కొనుగోలు చేసే దాకా తాము ధర్నాను విరమించబోమన్నారు. కాగా ఎస్సై గోకారి, ఏపీఎం పార్వతమ్మ ధర్నా వద్దకు చేరుకొని రైతులకు నచ్చజెప్పి ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని ధర్నాను విరమింపజేశారు.

పొన్నకల్‌లో ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా నిర్వహిస్తున్న రైతులు

రోడ్డెక్కిన పొన్నకల్ రైతులు

- ధాన్యం విక్రయానికి పడరాని పాట్లు
- ఆగ్రహంతో రోడ్డెక్కుతున్న అన్నదాతలు
- ధర్నాలు చేస్తేనే కొంటారా? అని నిలదీత
- షరతుల్లేకుండా ధాన్యం కొనాలని డిమాండ్

మూసాపేట(అడ్డాకుల), మే 5: వరి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నా చేపట్టారు. నెల రోజులుగా పంటను కోసి ధాన్యం విక్రయించాలని ఎదురు చూస్తున్నా.. సేకరణ చేయడం లేదని ఆగ్రహించిన అన్నదాతలు రోడ్డుకు అడ్డంగా కంప, రాళ్లు పెట్టి ఆందోళన చేపట్టారు. అడ్డాకుల మండలం లోని పొన్నకల్‌లో వరిధాన్యం సేకరించడం లేదని అధికారులను శనివారం నిలదీయడంతో సోమవారం తాసీల్దార్ గ్రామ పంచాయతీ వద్దకు వస్తారు. మాట్లాడదామని రైతులకు సర్దిచెప్పినట్లు తెలిపారు. అందుకు సోమవారం ఉదయం 9గంటల నుంచే పొన్నకల్ రైతులంతా జీపీ సమీపంలో రోడ్డుపై నిరీక్షించారు. తాసీల్దార్ శేఖర్ గ్రామానికి వచ్చారు. రైతులు ఉన్నచోట కాకుండా నేరుగా గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లారు. తాసీల్దార్‌ను రైతులు అక్కడికే రావాలని, జీపీ వద్దకు వస్తే మా సమస్యలు విన్నవించుకుంటామని ఫోన్‌ద్వారా కోరినట్లు తెలిపారు. కానీ అందుకు తాసీల్దార్ మీ గ్రామంలోనే ఉన్న కొనుగోలు కేంద్రం వద్దకే రావాలని సూచించారు. అందుకు ఆగ్రహించిన రైతులు తమ ధాన్యం సేకరణ చేయనందుకే తాసీల్దార్ జీపీ వద్దకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ రోడ్డుకు ఇరువైపులా కంప, రాళ్లను తీసుకొచ్చి రోడ్డుకు అడ్డంగా వేసి ఆందోళన చేశారు. అక్కడికి చేరుకున్న ఏపీఎం సుధీర్‌కుమార్ కొనుగోలు కేంద్రం వద్దకు ధాన్యం తీసుకోస్తే కొనుగోలు చేస్తామని చెప్పారు. అందుకు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామం మొత్తం ఇక్కడే ఉండడం తోపాటు వ్యవసాయ పంటలు కూడా గ్రామం చుట్టూ ఉన్నాయని, మీరు పొన్నకల్‌కు అనుబంధ గ్రామం దుబ్బపల్లి వద్ద కొనుగోలు కేంద్రం ఎలా ఏర్పాటు చేశారని నిలదీశారు. మేమంతా ధాన్యం ఈ గ్రామం నుంచి మరో గ్రామానికి తీసుకొని రావాలంటే ఎన్ని ఇబ్బందులు ఉంటాయని, ఖర్చుతో పాటు అక్కడ ధాన్యం కాపాడుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని ఆరోపించారు. వర్షం వస్తే దిక్కు తోచక ధాన్యాన్ని వదిలేయాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై తాసీల్దార్ శేఖర్ ఉన్నతాధికారులతో చర్చించినట్లు తెలిపారు. ఘటనా స్థలం వద్ద వాహనాలు నిలిచిపోవడంతో వాహన దారులు రైతులతో వాగ్వాదానికి దిగారు. రైతుల సమస్యను వివరించడంతో మిన్నకుండిపోయారు. అంతలోపే ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. రైతులతో చర్చించి సమస్య ఉంటే తాసీల్దార్‌తో మాట్లాడాలని, నేను కూడా తాసీల్దార్‌తో మాట్లాడుతానని సర్దిచెప్పడంతో వాహనాల రాక పోకలను వదిలేశారు. ఈ విషయంపై తాసీల్దార్ రైతులతో ఫోన్‌లో మాట్లాడుతూ.. సమస్యను జిల్లా అధికారులతో చర్చించామని, ఉన్నతాధికారుల సూచన మేరకు లారీలు వచ్చే అవకాశం ఉన్నచోట గ్రామం లోనే ధాన్యం కొనుగోలు చేస్తామని, లేకుంటే ట్రాక్టర్లకు కూడా అనుమతి ఇస్తామని చెప్పడంతో శాంతించారు.

వడ్వాట్ గేట్ సమీపంలోని రాయిచూర్ హైవేపై బైఠాయించిన రైతులు

మాగనూరు, మే 5: మండలం లోని వడ్వాట్ వైష్ణవి రైస్ మిల్లులో ధాన్యం బస్తాలు దింపుకోకుండా రైస్‌మిల్లు యజమాని తాళం వేసుకొని వెళ్లాడని.. రైస్‌మిల్లు వద్ద ఎదురు చూస్తున్న రైతులు ధర్నాలు చేస్తేనే ధాన్యం కొంటారా అని ఆవేదన వ్యక్తం చేస్తూ వడ్వాట్ సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం మూడు గంటల మధ్యలో పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వడ్వాట్ గేటు సమీపంలో ఉన్న వైష్ణవి రైస్ మిల్లు వద్ద మూడు రోజులుగా సుమారు 50మంది రైతులు సొంత, కిరాయి వాహనాలతో పడిగాపులు కాసిన వడ్లు కొనుగోలు చేసే సమయానికి మిల్లు క్వాంటిటీ అయిపోయిందని చెబుతున్నారని వాపోయారు. కొంతమంది రైతుల దగ్గర ప్రభుత్వానికి విరుద్ధంగా 3నుంచి 5కిలోల తరుగు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఓపక్క సీఎం, వ్యవసాయ శాఖ మంత్రులు రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని గొప్పలు చెప్పుకుంటున్నా.. ఇక్కడ రైస్‌మిల్లులో యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్ యజమానులకు ఆంక్షలు విధించడంతో ధాన్యం క్వాంటిటీ అయిపోగానే మళ్లీమళ్లీ రైతులు ధర్నాలు చేస్తే తప్పా ప్రభుత్వం ధాన్యం కొనడేమో పరిస్థితికి జారిపోయిందని రైతులు మండిపడుతున్నారు. మిల్లర్లు మూడునుంచి ఐదు కిలోల తరుగు ఇస్తేనే వడ్లు కొంటామని లేకపోతే మిగతా రైతులు వేరే రైస్‌మిల్లుకు వెళ్లాలని చెబుతున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం అమ్ముకోవాలంటే రైతులు రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొందని.. అధికారులు మిల్లుల వైపు కన్నెత్తి చూడకపోవడంతో మిల్లర్లు, అధికారులపై రైతులు మండిపడుతున్నారు. గంటపాటు జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేయడంతో ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న తాసీల్దార్ సురేశ్‌కుమార్, ఏఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు ఎంత నచ్చచెప్పినా అధికారులు వచ్చి నామ మాత్రంగా వారికి చెప్పడంతో ఆ పూటకు ధాన్యం కొని మళ్లీ యథావిధిగా మిల్లర్లు క్వాంటిటీ అయిపోయిందని చెప్పి రైతుల ద్వారా తరుగు తీసి కొనుగోలు చేసుకుంటున్నారని తాసీల్దార్‌కు తెలిపారు. అలా ఏం జరగకుండా నేను ముందుండి వడ్లు దింపిస్తానని రైతులతో మాట్లాడారు. అయినా రైతులు వినకుండా ధర్నాకు కూర్చున్నారు. ధాన్యం కొనేలా సంబంధిత అధికారులు చర్యలు సంప్రదింపులు జరిపి వైష్ణవి రైస్ మిల్ యజమానితో ధాన్యం కొనేలా చర్యలు తీసుకోవాలని చెప్పడంతో అప్పటికప్పుడు ప్రస్తుతానికి 3000 బస్తాలు తీసుకోవాలని రైస్ మిల్ యజమానికి ఒప్పించడంతో రైతులు ధర్నా విరమించుకున్నారు. వివిధ గ్రామాల రైతులు భారీగా పాల్గొన్నారు.

ధన్వాడ మండలంలోని రైస్‌మిల్ వద్ద ధాన్యం లోడ్‌తో బారులుదీరిన వాహనాలు

మిల్లుల వద్ద వాహనాల బారులు

ధన్వాడ, మే 5: మండలంలో ధాన్యం కొనుగోలు రెండు రోజులుగా నిలిపివేయడంతో సోమవారం ట్రాక్టర్లతో రైతులు మిల్లుకు పోటెత్తారు. సూమారు 70 ట్రాక్టర్లు, లారీలు, డీసీఎంల్లో రైతులు వడ్లను అమ్మేందుకు క్యూ కట్టడంతో మిల్లర్లు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మిల్లుకు వచ్చి మూడు రోజులు గడుస్తున్నా.. ధాన్యాన్ని కొనడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు సింగిల్‌విండో, అటు మిల్లుల చుట్టూ తిరిగితిరిగి అలిసిపోతున్నట్లు రైతులు వాపోయారు. వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుందని ముందు ట్రాక్టర్లలో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నారు.

ధాన్యం ట్రాక్టర్లతో బైఠాయింపు

ధర్నా చేస్తున్న రైతులు

దామరగిద్ద, మే 5: దొడ్డు వడ్లు కొనాలని మండల రైతులు కాన్‌కుర్తిలో ట్రాక్టర్‌లతో ధర్నా, రాస్తారోకో చేశారు. దామరగిద్ద మండలానికి సంబంధించిన యాసంగిలో రైతులు పండించిన వడ్లు ఐకేపీ సెంటర్ల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కోస్గి వద్ద ఉన్న వెంకటేశ్వర, ధనలక్ష్మి రైస్ మిల్లులకు పంపుతున్నారు. శనివారం నుంచి సదరు రైస్‌మిల్ వద్ద లిమిట్ మించి పోయిందని ధాన్యం తీసుకోవడం నిలిపివేయడంతో రైతులకు ధాన్యం అమ్మే తిప్పలు తప్పలేదు. క్యాతన్‌పల్లికి చెందిన సాయిరాం రైస్‌మిల్ వారు దొడ్డు వడ్లు అయినా తీసుకుంటాం కాని రైతులు తెచ్చిన వడ్లు వేసుకోవడానికి గోదాం లేదని, కాన్‌కుర్తి గోదాంలో అనుమతిస్తే వేసుకుంటామని చెప్పడంతో సోమవారం రైతులు యాసగుంది వద్ద ఉన్న కాన్‌కుర్తి గోదాంకు ధానాన్యాన్ని వేయడానికి వెళ్లారు. అయితే అక్కడ దగ్గర్లో ఉన్న పత్తి మిల్లులో కాంటా పనిచేయక పోవడంతో రైతులు రాత్రి, పగలు ధాన్యాన్ని పెట్టుకుని రోడ్ల మీదనే ఉండాల్సిన పరిస్థితి రావడంతో మళ్లీ కథ మొదటికే వచ్చింది. ఇలా విసిగివేసారిన రైతులు తమ ధాన్యం ట్రాక్టర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి ధర్నాకు దిగారు. అందులో అది యాద్గీర్, హైదరాబాద్ హైవే కావడంతో రెండు గంటల్లో దాదాపు రెండు కిలో మీటర్ల మేర ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయంపై ఐకేపీ ఏపీఎం నర్సింహులును వివరణ కోరగా.. రైతుల దొడుదొడ్డల గురించి మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతులు తెచ్చిన సన్నవడ్లను కొన్నామన్నారు. దొడ్డువడ్లు ఎవరు కొనడం లేదని, అయితే క్యాతన్‌పల్లి సాయిరాం రైస్‌మిల్లు వారు కొంటామని చెప్పారు. కానీ దగ్గర్లో ఉన్న ప్రైవేట్ కాంటా చెడిపోవడంతో రైతులకు ఇబ్బంది కలిగిందన్నారు. రెండురోజుల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్సై అరుణ్, మార్‌పోలీసులు, డీఎస్‌వో బాలరాజు వెళ్లి దొడ్డవడ్లు కొనే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

గన్నీబ్యాగులకు ఎదురుచూపులు

ధన్వాడ విండో కార్యాలయం వద్ద గుమిగూడిన రైతులు

ధన్వాడ, మే 5 : మండల కేంద్రం లోని సింగల్‌విండో కార్యాలయం వద్ద గన్నీ బ్యాగుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మూడు రోజుల నుంచి నిత్యం విండో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విండో సీఈవో వెంకట్రాములును వివరణ కోరగా.. సాయంత్రం వరకు గన్నీ బ్యాగులు వస్తాయని, రాగానే రైతులకు గన్నీ బ్యాగులు అందజేస్తామని తెలిపారు.

ఆరబెట్టుడు.. బొడ్డెవోయుడు

- నిద్రాహారాలు మాని మార్కెట్‌లోనే ధాన్యం కోసం రైతుల పడిగాపులు

మార్కెట్‌లో బిగాలుగా రైతులు

కొల్లాపూర్ రూరల్, మే 5 : మండల కేంద్రం లోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు పదిరోజులుగా రైతులు కొన్ని వందల క్వింటాళ్ల వడ్లను తీసుకొచ్చారు. ప్రతిరోజూ వరి కుప్పలు ఆరబెట్టాలి.. మళ్లీ సాయంత్రం బొడ్డే వేయడం తోనే సరిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మార్కెట్ యార్డును నమస్తే తెలంగాణ సందర్శిస్తే రైతులు మనోవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ పగలు రాత్రి పడిగాపులు కాస్తున్నామని ఆరోపించారు. పదిరోజులుగా మార్కెట్ యార్డులో అధికారులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించక రైతులు బిక్కుబిక్కుమని పడిగాపులు కాస్తున్నారు. అధికారులు మాత్రం ఇప్పుడప్పుడని కాలం వెల్లదీస్తున్నారు. ఇంకా ఎన్ని రోజులు ఉండాలో తెలియక రైతులు దిగాలు చెందుతున్నారు. పగలు, రాత్రి నిద్రాహారాలు మాని మార్కెట్ యార్డులోనే దినాలు గడుపుతున్నామని వాపోతున్నారు. ఆకాల వర్షాలు, ఉరుములు మెరుపులతో ఆందోళన చెందుతుంటే.. వడ్లు ఆరిపోయి గలగలా మోగుతున్నా అధికారులు మిషన్లు పెట్టి తేమశాతం ఉంది ఇంకా ఆరాలని చెబుతున్నారని రైతులు మనోవేదన చెందుతున్నారు. ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం అంటే ఇదేనా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కన్నీళ్లు పెట్టించడమేనా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆరుగాలం ధాన్యాన్ని పండించి మార్కెట్‌కు తీసుకొని వస్తే ప్రభుత్వం ఇంకా కొనకుండా రైతులను మానసికంగా ఇబ్బందులకు గురిచేడయం సబబు కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాన్నికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కొల్లాపూర్ మార్కెట్ యార్డులోనే ఉండిపోయిన ధాన్యం

ప్రజలు బీఆర్ఎస్ వైపే చూస్తున్నారు


బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులను ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

బాలానగర్, మే 5 : రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండలం లోని నేర్లపల్లిలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 25మంది కార్యకర్తలు లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి మాజీ మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలు అంటూ ఊదర గొట్టి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ నేతలు ఇచ్చే హామీలు పత్రికలకు పరిమితం కావడం తప్పా ప్రజలకు అందవని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా నిలబడిందని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా వంటి పథకాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయని అన్నారు. మోసంతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఒరిగిందేమీ లేదని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, వెంకటాచారి, చెన్నారెడ్డి, గణేశ్‌గౌడ్, మంజ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హౌజ్‌లో పడి నాలుగేండ్ల చిన్నారి మృతి

నిహాన్సి (ఫైల్)

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), మే 5 : నీటి హౌజ్‌లో పడి నాలుగేండ్ల చిన్నారి మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం ఇస్రంపల్లిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఇస్రంపల్లి గ్రామానికి చెందిన కుర్వ రమేశ్‌కు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా కూతురు నిహాన్సి (4) సోమవారం సాయంత్రం ఇంటిబయట ఆడుకుంటూ వెళ్లి మూతలేని నీటి హౌజ్‌లో పడిపోయింది. ఆ పరిసర ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో చిన్నారి నీటిలో మునిగి మృతి చెందింది. కుటుంబ సభ్యులు పాప కోసం వెతికగా చివరికి నీటిగుంతలో శవమై తేలడంతోకన్నీరు మున్నీరయ్యారు.

కదిలిన యంత్రాంగం

రైస్‌మిల్లుల తనిఖీ

- కేంద్రాలకే ధాన్యం తీసుకురావాలి : డీఎస్‌వో

మిల్లు వద్ద రైతుల సమస్యలు తెలుసుకుంటున్న డీఎస్‌వో

మద్దూర్, మే 5 : రెండు రోజులుగా నమస్తే తెలంగాణలో వస్తున్న కథనాలకు ఎట్టకేకలకు జిల్లా యాంత్రంగం కదిలివచ్చింది. శనివారం రైతన్నల రణం, ఆదివారం అడుగడుగునా అడ్డంకులు శీర్షికలతో ప్రచురితమైన వార్తలకు పేట డీఎస్‌వో సైదులు స్పందించారు. సోమవారం మద్దూర్ మండల కేంద్రంలో రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలకు కాకుండా నేరుగా మిల్లులకే ధాన్యాన్ని తీసుకొస్తుండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న పారబైల్డ్ రైస్ మిల్లులు తక్కువగా ఉండడంతో సమస్య ఏర్పడిన విషయమై కమిషనరేట్ తెలుపగా గద్వాల, రంగారెడ్డి జిల్లాలకు ధాన్యాన్ని తరలించేందుకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లలోని ధాన్యాన్ని లారీల్లోకి అన్‌లోడ్ చేయించి తరలిస్తామన్నారు. రైతులు నేరుగా రైస్ మిల్లులకు రాకుండా కొనుగోలు కేంద్రాకు వెళ్లాలని సూచించారు. మిల్లుల వద్ద ఉన్న రైతులు తమ సమస్యను డీఎస్‌వోకు వివరించారు. సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

నమస్తే ఎఫెక్ట్

రూ.4కోట్ల ఐపీ పెట్టిన ఖరీదుదారుడు

- ఆవేదన చెందుతున్న కమీషన్‌దారులు

గద్వాల అర్బన్, మే 5: కమీషన్‌దారుల నుంచి ఓ ఖరీదుదారుడు ధాన్యం తీసుకొని తీరా వారికి డబ్బులు చెల్లించకుండా ఐపీ పెట్టిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకోవడం కలకలం రేగుతుంది. బాధితుల వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లోని ఓ ఖరీదుదారుడు ఆయా కమీషన్‌దారుల దుకాణాల్లోకి వెళ్లి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఖరీదు చేసినట్లు సమాచారం. వాస్తవానికి ధాన్యం ఖరీదు చేసిన అనంతరం 7నుంచి 14రోజుల్లోగా డబ్బులు చెల్లించాలి. కానీ సదరు ఐపీ పెట్టిన ఖరీదుదారుడు నెలల గడుస్తున్నా కమీషన్‌దారుల నుంచి తీసుకున్న ధాన్యం డబ్బులు చెల్లించకుండా మాటలు చెబుతూ కాలం గడిపాడు. డబ్బులు రాక పోవడంతో కమీషన్‌దారులు తమ వ్యాపారం దెబ్బతింటుందని గ్రహించి తమ డబ్బులు చెల్లించాలని ఖరీదుదారుడిపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో సదరు ఖరీదుదారుడు నారాయణపేట జిల్లా మార్కెట్ యార్డ్‌లో కూడా కమీషన్‌దారుల నుంచి ధాన్యం తీసుకొని డబ్బులు చెల్లించకుండా తిరుగుతున్నాడని వారు డబ్బులు చెల్లించాలని వత్తిడి చేసినట్లు సమాచారం. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కూడా కమీషన్‌దారుల దగ్గర కూడా ధాన్యం తీసుకుని డబ్బులు చెల్లించలేక పోవడంతో సదరు కమీషన్‌దారుల ఫిర్యాదు మేరకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులను ఆశ్రయించడంతో వారు అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సమాచారం. పక్క రాష్ట్రం లోని రాయిచూర్ జిల్లాలో కూడా సదరు ఖరీద్‌దారుడు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించేది ఉందని స్థానికుల ద్వారా తెలిసింది. గద్వాల మార్కెట్ యార్డ్‌లోని కమీషన్‌దారుల తో పాటు అన్ని దగ్గర రూ.4కోట్లకు పైగా ఐపీ పెట్టి తనకు డబ్బులు ఇవ్వాలని వత్తిడి చేసిన వారికి కోర్టు నుంచి నోటిసులివ్వడంపై కమీషన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం 20 రోజుల నుండి జిల్లా కేంద్రం తోపాటు మహబూబ్‌నగర్, నారాయణపేట, కర్ణాటక లోని రాయచుర్ జిల్లాలో కమీషన్‌దారులు చర్చించుకోవడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఇలా చేయడం వల్ల నష్టపోతారు..

వాస్తవానికి మార్కెట్ యార్డ్‌లో రైతులు తీసుకొచ్చిన అనంతరం కమీషన్‌దారుల నుంచి ఖరీద్‌దారులు ధాన్యంను తీసుకుంటారు. రైతులకు తక్షణమే కమీషన్‌దారులు డబ్బులు చెల్లిస్తారు. కమీషన్‌దారుల నుంచి ధాన్యం తీసుకున్న ఖరీదు దారులు 7 నుంచి 14 రోజుల గడువులో డబ్బులు చెల్లించాలి. లేని పక్షంలో అందుకు తగ్గట్లు వడ్డీతో కలిపి డబ్బులు చెల్లించాలి ఆ విధంగా మార్కెట్‌లో ని బంధనలు పెట్టుకున్నట్లు తెలిపారు. కానీ ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వకుండా ఇలా చేయడం ద్వారా కమీషన్‌దారులు పెద్ద మొత్తంలో నష్టపోతారు. వారి వ్యాపారం దెబ్బతింటుంది. వ్యాపారం దెబ్బతింటే వ్యాపారం చేసే వారు లేకపోతే రైతులకే పెద్ద నష్టం. ఇలా ఉన్న ఫలంగా ఐపీలు పెడితే తమ పరిస్థితి ఏంది అంటు.. ఇప్పటికే కమీషన్‌దారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం చొరవ తీసుకుని కమీషన్‌దారులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు.

– మహేశ్వర్‌రెడ్డి, గద్వాల మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు

రైస్ మిల్లులో అగ్ని ప్రమాదం

ఎగిసిపడుతున్న మంటలు

పెబ్బేరు, మే 5 : పెబ్బేరు సమీపం లోని జాతీయ రహదారి పక్కనున్న సాయిగోపాల్ ఇండస్ట్రీస్‌లో సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. దీంతో మిల్లులోని ధాన్యం, బియ్యం బస్తాలు పెద్ద ఎత్తున కాలి బూడిదయ్యాయి. యంత్రాలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రమాదం ఎలా సంభవించిందో తెలియడం లేదని యజమాని వాపోయారు. రూ. లక్షల్లో ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. కొత్తకోట నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అవి ఎగిసిపడుతూనే ఉన్నాయి.

వడదెబ్బ లక్షణాలతో వ్యక్తి మృతి

కోడేరు, మే 5 : వడదెబ్బ లక్షణాలతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలం లోని నాగులపల్లితండాలో సోమవారం చోటుచేసుకున్నది. తండా వాసుల కథనం ప్రకారం.. నాగులపల్లితండాకు చెందిన రాత్లావత్ గోపాల్ (52) ఆదివారం వ్యవసాయ పొలంలో ఉన్న మామిడి తోటకు నీళ్లు పారించడానికి వెళ్లాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అర్ధరాత్రి వాంతులు వీరేచనాలు కావడంతో కొల్లాపూర్ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందినట్లు వివరించారు. మృతుడికి భార్య చిన్నమ్మతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.